

రబీ ఆశలపై తుంగభద్ర 'నీళ్లు'

- కొట్టుకుపోయిన తుంగభద్ర 19వ గేటు
- వృథాగా పోతున్న నీరు
- ఆయకట్టు భవిష్యత్తు ప్రశ్నార్థకం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/హోళగుంద

తుంగభద్ర డ్యాం గేటు కొట్టుకుపోవడంతో నీరు వృథాగా పోతున్నాయి. ఎల్ఎల్‌సి కింద రబీకి నీరు అందించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు. దీంతో ఆయకట్టు రైతుల భవిష్యత్తు ప్రశ్నార్థకం కానుంది...

తుంగభద్ర డ్యామ్ 19వ గేట్ శనివారం రాత్రి 11 గంటల సమయంలో ప్రమాదవశాత్తు కొట్టుకుపోయింది. గేట్ చైన్‌లింక్ తెగిపోవడంతో గేట్ ఊడిపోయి వరద నీటిలో కొట్టుకుపోయింది. ఆ ప్రాంతం ద్వారా 35 వేల క్యూసెక్కుల నీరు వృథాగా పోతోంది. గేట్ కొట్టుకుపోయిన స్థలంపై ఎక్కువ ఒత్తిడి పడకుండా మరో 32 గేట్ల ద్వారా మొత్తం మీద 90 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అధికారుల అలసత్వంతోనే ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రతి ఏటా డ్యాం గేట్ల వార్షిక తనిఖీ నిర్వహిస్తారు. ఈ ఏడాది మేలో ఇంజనీర్లు ఈ తనిఖీ నిర్వహించారు. గేట్ల నిర్వహణ సక్రమంగా లేదని, ప్రత్యామ్నాయంగా గేట్లు ఏర్పాటు చేసుకోవాలని నిపుణులు హెచ్చరించారు. వాటిని తుంగభద్ర బోర్డు అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఈ ఘటన చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. జలాశయానికి ఇన్‌ఫ్లో తగ్గడంతో శనివారం రాత్రి డ్యాం అధికారులు 19వ గేటును మూసి వేసేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో చైన్‌లింక్ తెగిపోయి గేట్ కొట్టుకుపోయింది. గేటు మరమ్మతులు పూర్తి కావడానికి ఐదు నుండి ఆరు రోజులు సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. తుంగభద్ర డాం ప్రవాహం వల్ల 19వ గేట్ కొట్టుకుపోవడంతో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోవచ్చు అనే విషయంలో ఒక నిర్ధారణకు వచ్చి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. మరమ్మతులు పూరయ్యే లోపు తుంగభద్ర డ్యాం నుండి 50 టిఎంసి వరకు నీరు దిగువ ప్రాంతాలకు వృథాగా వెళ్లిపోనున్నట్లు బోర్డు అధికారులు అంచనాకు వచ్చారు. జలాశయ నీటి నిల్వ సామర్థ్యం 105.788 టిఎంసిలు కాగా ప్రస్తుత జలాశయ నీటి నిల్వ 104.182 టిఎంసిలుగా ఉంది. 50 టిఎంసిలు జలాశయం నుంచి వెళ్లిపోతే జలాశయ నీటి నిల్వ సగానికి తగ్గిపోనుంది. ప్రస్తుతం డ్యాం ఇన్‌ఫ్లో 24,500 క్యూసెక్కులు మాత్రమే ఉంది. భవిష్యత్తులో మంచి వర్షాలు కురిస్తే తప్ప మళ్లీ డ్యాం నిండే పరిస్థితి లేదని అధికారులు చెబుతున్నారు. కర్నాటకలోని బళ్లారి, రాయచూరు, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, అనంతపురం జిల్లాలకు నీటిని అందించేందుకు వీలుగా కర్ణాటకలోని హొస్పేట వద్ద 1953లో తుంగభద్ర డ్యాంను నిర్మించారు. ఈ డ్యాం నుంచి లోలెవల్, హైలెవల్, లెఫ్ట్ బాంక్ కెనాల్స్ నిర్మించారు. ముఖ్యంగా లోలెవల్ కెనాల్ (ఎల్ఎల్‌సి కెనాల్)ను కర్నూలు జిల్లాకు తాగునీరు అందించేందుకు నిర్మించారు. ఖరీఫ్, రబీ సీజన్‌లో ఎల్ఎల్‌సి కాలువ కింద సుమారు లక్షా 52 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. 200 గ్రామాలకు తాగునీరు కూడా అందుతోంది. జలాశయం ఖాళీ అయితే రబీలో ఎల్ఎల్‌సి ఆయకట్టుకు నీరందించే అవకాశం లేదని అధికారులు చెబుతున్నారు.

కర్ణాటక డిప్యూటీ సిఎం పరిశీలన

తుంగభద్ర డ్యామ్ 19వ గేటును ఆదివారం కర్ణాటక డిప్యూటీ సిఎం డికె.శివకుమార్ పరిశీలించారు. గేటు ధ్వంసం అవడానికి గల కారణాలను ఇంజనీర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడుతూ నిపుణుల బృందం జలాశయాన్ని పరిశీలిస్తోందని చెప్పారు. కేంద్ర జల సంఘం కూడా నిపుణులను పంపిందని వివరించారు. జలాశయం నుంచి నీరు పెద్ద ఎత్తున బయటకు పోతోందని అన్నారు. జలాశయం దిగువన ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుంగభద్ర డ్యామ్‌లో 40 టిఎంసిల నీరు నిల్వ ఉంచినట్లు తెలిపారు. మిగతా నీటిని నదికి విడుదల చేస్తే గేటు మరమ్మతులకు ఆస్కారం ఉంటుందని వివరించారు. వీలైనంత త్వరగా గేటు పునరుద్ధరణ చేస్తామని వెల్లడించారు. ఈ ఏడాది ఖరీఫ్ పంటకు మాత్రమే నీళ్లు అందేలా చూస్తామని చెప్పారు. రబీ పంటకు నీరు అందించడం కొంచెం కష్టమేనని, రైతులు సహకరించాలని కోరారు. అంతకు ముందు డ్యాంను కర్ణాటక మంత్రి శివరాజ్ పరిశీలించారు. ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, బుసినే విరూపాక్షి కూడా గేట్ కొట్టుకుపోయిన ప్రాంతాన్ని పరిశీలించారు.



తుంగభద్ర 19వ గేటు కొట్టుకుపోవడంతో వృథాగా పోతున్న నీరు

సుందర నగరంగా కర్నూలు

- నగర అభివృద్ధే లక్ష్యం
- ప్రజాశక్తితో మేయర్ బివై రామయ్య ముఖాముఖి

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూల్లో నగరాన్ని సుందరమైన నగరంగా తీర్చిదిద్దడమే ప్రధాన లక్ష్యమని కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బివై.రామయ్య అన్నారు. నగర అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తాను మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన తరువాత రూ.720 కోట్లతో అభివృద్ధి పనులు చేశామని చెప్పారు. ఆయన ప్రజాశక్తితో ముఖాముఖిగా మాట్లాడారు...



నగర మేయర్‌గా కర్నూలు నగరాభివృద్ధికి ఏఏ అభివృద్ధి పనులు చేశారు?

మేయర్ : పాలకమండలి అధికారం చేపట్టిన తర్వాత నగర మేయర్‌గా రూ.720 కోట్లతో అభివృద్ధి పనులు చేశాం. అందులో ప్రధానంగా తాగునీరు, మురుగునీటి కాలువలు, పార్కులు, రోడ్లు, పారిశుద్ధ్యం తదితర పనుల కోసం ఖర్చు చేశాం.

నగరంలో వీధి కుక్కలు ఎక్కువయ్యాయి. వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మేయర్ : కర్నూలులో కుక్కలు ఎక్కువైన సంగతి వాస్తవమే వాటి నియంత్రణ కోసం గార్గేయపురం డంపు యార్డ్ వద్ద కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు ఏర్పాట్లు చేశాం. అక్కడ రోజూ 25 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసేందుకు మాత్రమే వసతులు ఉన్నాయి. దీనితో నగరంలో ఉన్న 52 వార్డులలో పూర్తిస్థాయిలో కుక్కలను నియంత్రించలేకపోతున్నాం. అందుకని గత కౌన్సిల్ సమావేశంలో ప్రతిరోజు 50 కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసే విధంగా ఏర్పాట్లు చేయాలని తీర్మానం చేశాం.

నగరంలో పారిశుధ్యం పడకేసింది. దీంతో దోమలు ఎక్కువై ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. దీనిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మేయర్ : కర్నూలు నగర జనాభా కనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులు లేరు. గత సంవత్సరం కాలువలో సిల్టు తీసేందుకు 180 మంది కార్మికులను తీసుకొని పనిచేయించాం. కాంట్రాక్టు సమయం సంవత్సరం పూర్తి అయినందున వారిని తొలగించాం. మళ్లీ కౌన్సిల్లో 200 మందిని తీసుకోవాలని తీర్మానం చేయడం జరిగింది. ప్రభుత్వం నుండి అనుమతి అందిన వెంటనే టిఎల్ఎఫ్ (టౌన్ లెవెల్ ఫెడరేషన్) ద్వారా కార్మికులను తీసుకుంటాం.

నగరంలోని పార్కుల స్థలాలు అన్యాక్రాంతం అవుతున్నాయి. వాటి రక్షణ కోసం ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మేయర్ : గతంలో పార్కులు అన్యాకాంతం అయిన మాట వాస్తవం. ప్రస్తుతం అలాంటి జరగకుండా రక్షణ వలయాలు ఏర్పాటు చేస్తున్నాం ఆ ప్రాంతాల్లో ఇది నగరపాల సంస్థ చెందిన స్థలం అనే బోర్డులు కూడా పెడుతున్నాం. నగరంలో కొన్ని పార్కులను సుందరంగా తీర్చిదిద్దాం. ప్రాధాన్యత క్రమాన్ని బట్టి పార్కులను అభివృద్ధి చేస్తాం.

నగరపాలక సంస్థలో అవినీతి పెరిగిపోయింది. దాని నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

మేయర్ : కేవలం నగరపాలక సంస్థలోనే కాదు అన్ని ప్రభుత్వ కార్యాలయాలు కూడా అవినీతి కనిపిస్తుంది. అందుకు ప్రజలు కూడా కొంత కారణం. స్పీడ్ యుగంలో పనులు తొందరగా కావాలని తపనతో ప్రజలే అధికారులకు డబ్బులు ఇచ్చి పనులు చేయించుకొని పోతున్నారు. అలా చేయడం వల్ల అందుకు అలవాటు పడ్డవారు వారి పనులను పెండింగ్ చేస్తూ డబ్బులు రానిదే పని చేయకుండా తయారయ్యారు. ఎవరైనా అలాంటి వ్యక్తులు ఉన్నట్లు మా దృష్టికి వస్తే వారిపై చర్యలు తీసుకుంటాం.

నగరంలో వాహనాల రద్దీ పెరిగి ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

మేయర్ : నగరంలో వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుంది. ట్రాఫిక్‌లో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేవిధంగా రోడ్ల విస్తరణ చేసేందుకు చర్యలలో భాగంగా రోడ్డు విస్తరణలో పోయే షాపులు, ఇండ్ల యజమానులతో సమావేశాలు నిర్వహించి వారికి తగిన నష్టపరిహారం ఇచ్చి రోడ్లు వెడల్పు చేసే కార్యక్రమాన్ని చేయాలని చూస్తున్నాం. అందుకు నగర ప్రజలు కూడా సహకరించాలి. నగరంలో వాహనాల రద్దీని నియంత్రించేందుకు రోడ్ సేఫ్టీ సమావేశాలను కూడా నిర్వహించాం.

ఫుట్‌పాత్ కార్మికుల కోసం ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

మేయర్ : కర్నూల్ నగరంలో ప్రజలకు ఉపాధి అవకాశాలు లేక డిగ్రీలు చదువుకున్న ఉద్యోగాలు రాక స్వయం ఉపాధి అవకాశాలను ఎంచుకొని రోడ్లపై చిరు వ్యాపారాలు చేసుకుంటున్నారు. వారిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటే మా పొట్ట కొడతారా అని ప్రాధేయపడటంతో వారికి మున్సిపల్ స్థలాలలో చిన్న చిన్న షాపులు పెట్టుకోవడానికి రోడ్ సైడ్ వ్యాపారాలు చేసుకునే వారికోసం షెడ్లను ఏర్పాటు చేస్తున్నాం. వాటి ద్వారా వారు ఉపాధిని పొందవచ్చు.

నగరంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగుల వాడకం ఎక్కువైంది. వాటి నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

మేయర్ : ప్రజారోగ్య విభాగం ఎంహెచ్ఓ ద్వారా సానిటరీ ఇన్స్పెక్టర్లు ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌ల వాడకపు దారులపై దాడులను నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తున్నాం. క్యారీ బ్యాగులను వాడకుండా ఉండే విధంగా వ్యాపారులలో అవగాహన కల్పిస్తున్నాం.

కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లలో ఉన్న షాపులు ఎన్ని ఉన్నాయి? షాపుల ద్వారా అద్దెలు ఎంత వసూలు అయ్యాయి..? ఎంత బకాయి ఉంది..?

మేయర్ : నగరపాలక సంస్థ పరిధిలో 416 షాపులు ఉన్నాయి. వాటి ద్వారా రూ.1 కోటి 13 లక్షల 36 వేల 379లు అద్దెలు వసూలు అయ్యాయి. షాపుల అద్దెలు ఇంకా రూ.1 కోటి 74 లక్షల 99 వేల 766లు వసూలు కావాల్సి ఉంది.



రేషన్ బండ్లకు మంగళం

- రేషన్ దుకాణాల్లోనే నిత్యవసర సరుకులు
- ఎండియు ఆపరేటర్ల తొలగింపునకు సిద్ధం?

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో రేషన్ బండ్ల ద్వారా రేషన్ పంపిణీ పై సిఎం చంద్రబాబు నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రేషన్ బండ్ల ద్వారా నిత్యవసర వస్తువుల పంపిణీ ప్రభుత్వానికి భారంగా మారిందని వెంటనే ఈ వ్యవస్థను నిలిపివేతకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యాఖ్యలు చేశారు. అందుకు అను గుణంగా రేషన్ బండ్లను నడుపుతున్న ఎండియు ఆపరేటర్ల పరిస్థితి గందర గోళంగా మారింది. వచ్చే నెల నుండి ఈ వ్యవస్థను పూర్తిగా నిలిపివేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిసింది. కర్నూలు జిల్లాలో మొత్తం1233 రేషన్ దుకాణాలు ఉన్నాయి. జిల్లాలో 6,76,209 తెల్ల రేషన్ కార్డులు ఉండగా 49 ఎండియు రేషన్ బండ్లున్నాయి. వైసిపి ప్రభుత్వం 2021లో ఇంటి వద్దకే రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఎండియు మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ వాహనాలను తీసుకువచ్చింది. ఈ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ సరుకులను పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంది. ఒక్క వాహనాన్ని రు 5.80లక్షలతో ప్రభుత్వం కొనుగోలు చేసింది. 60 శాతం సబ్సిడీతో ఈ వాహనాలను ఎండియు ఆపరేటర్లకు అందజేసింది. ఒక్కో ఎండియు ఆపరేటర్ ద్వారా రూ 63,000 ప్రభుత్వం డిపాజిట్ చేయించుకుని వాహనాలను అందజేసింది. మొత్తం 76 వాయిదాల కింద ఆపరేటర్‌కు వాహనాలను అందజేసింది. ప్రతినెల ఎండియు ఆపరేటర్‌కు రూ 21000 చెల్లిస్తుంది. అందులో నెలకురూ. రూ.8700 ఇఎమ్ఐలో రాష్ట్ర ప్రభుత్వం రూ.5700 చెల్లిస్తుంది. ఇంకా దాదాపుగా 30 ఇఎంఐలు చెల్లించాల్సి ఉండగా హఠాత్తుగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో ఆపరేటర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇక రేషన్ పంపిణీని రేషన్ దుకాణాల ద్వారానే చేపట్టాలని ప్రభుత్వం భావిస్తుంది. ఇప్పటికే అందుకు అనుగుణంగా పౌరసంపరాల శాఖ ద్వారా ప్రత్యేకంగా సర్వే కూడా నిర్వహిస్తుంది. జిల్లాలోని అనేక నియోజకవర్గాల్లో ఎండియు ఆపరేటర్లను మార్చాలని అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు అధికారంలోకి రాగానే సిఫార్సు లేఖలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం ఈ వాహనాల ద్వారా రేషన్ పంపిణీని నిలిపి వేసేందుకు చర్యలు తీసు కోవడంతో అధికార పార్టీ నేతలు కూడా వెనక్కి తగ్గారు. ఇప్పటికే పనిచేస్తున్న ఆపరేటర్లు తొల గించేందుకు ప్రభుత్వం పూనుకోవడం పట్ల మండి పడుతున్నారు. రేషన్ పంపిణీకి కొనుగోలు చేసిన ఈ వాహనాల పరిస్థితిపై కూడా ప్రభుత్వం ఎటు తేల్చుకోలేనరి పరిస్థితి ఉంది. ఈ వాహనాలను ఆపరేటర్లకే అప్పగిస్తారా లేక ప్రభుత్వం ఇతర కార్యక్రమాలకు వినియోగిస్తుందా లేదా అనేది చర్చ నీయాంశమైంది. ఎండియు ఆపరేటర్లు కూడా తమ జీవనోపాధికి ప్రభుత్వం గండికొట్టకుండా ఆదుకోవాలని విన్నవించుకుంటున్నారు.

ప్రజలు ఆందోళన పడొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తుంగభద్ర డ్యాం 19 వ గేటు కొట్టుకుపోయిన సందర్భంగా 90 వేల క్యూసెక్కుల నుండి లక్ష క్యూసెక్కుల నీటిని విడుదల చేసినందున మంత్రాలయం, కౌతాళం, కోసిగి, నందవరం, సి. బెళగల్ తహసీల్దార్లు జాగ్రత్తగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా ఆదేశించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు. ఆదివారం ఎస్‌పి, సబ్ కలెక్టర్, ఆర్‌డిఒలు, జలవనరుల శాఖ, డిజాస్టర్ మేనేజ్మెంట్ అధికారులు, తహసీల్దార్లతో కలెక్టర్ టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయిన సందర్భంగా నీటిని విడుదల చేసిన సందర్భంగా మంత్రాలయం, కౌతాళం, కోసిగి, నందవరం తహసీల్దార్లు ఉదయాన్నే అప్రమత్తం చేశారన్నారు. దండోరా, మైక్ అనౌన్స్‌మెంట్ ద్వారా ప్రజలకు నీటి విడుదల విషయాన్ని చెప్పి, నదిలోకి దిగనివ్వకుండా, చేపలు పట్టడానికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఎస్‌డిఆర్ఎఫ్ టీములను సిద్ధంగా ఉంచుకోవాలని, టీములు వచ్చే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎస్‌పి జి.బిందు మాధవ్ ను ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, ఇరిగేషన్, ఫిషరీస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. టెలి కాన్ఫరెన్స్‌లో డిఆర్ఓ మధుసూదన్ రావు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అధికారి అనుపమ, జిల్లా ఫిషరీస్ అధికారి శ్యామల, ఇన్‌చార్జి కమాండెంట్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్ కు సిఎం చంద్రబాబు ఫోన్

తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోవడంతో దిగవ స్థాయిలోని కర్నూలు జిల్లా ప్రాంతాలకు కు సంబంధించి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్‌ను సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మేరకు ఆదివారం జిల్లా కలెక్టరుకు సీఎం చంద్రబాబు నేరుగా ఫోన్ చేసి అక్కడ పరిస్థితులపై అడిగి తెలుసుకున్నారు. ఇరిగేషన్ మంత్రి సమన్వయం చేసుకొని పరిస్థితిలను ఎప్పటికప్పుడు చక్కదిద్దాలని పేర్కొన్నారు. ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని జిల్లా కలెక్టరున్ కోరారు. రాష్ట్రమంత్రి టీజీ భరత్ కూడా జిల్లా కలెక్టర్‌తో ఈ ఘటనపై చర్చించారు.

అధికారుల నిర్లక్ష్యంతో గేటు కొట్టుకుపోయింది

తుంగభద్ర డ్యాంపై టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు పి తిక్కారెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



తుంగభద్ర డ్యామ్ 19వ గేటు కొట్టుకొని పోవడంలో డ్యామ్ అధికారుల నిర్లక్షమే కారణమని టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కారెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలు టిడిపి జిల్లా కార్యాలయంలో పత్రికా, మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. గతంలో హైదరాబాద్ నవాబ్, మైసూర్ మహారాజ్ నిర్మించిన తుంగబద్రవ్యామ్ వల్ల కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్టాలలో వేలాది ఎకరాలకు సాగునీరేగాక తాగునీటిని కూడా అందుబాటులోకి తెచ్చారని గుర్తుచేశారు. ముఖ్యంగా కర్నాటకలోని బళ్లారి, హోస్‌పేట, రాయచూర్, ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు, కడప, అనంతపురం, తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఈ ప్రాజెక్టు నీటి వల్ల ఎంతో ఉపయుక్తంగా ఉందన్నారు. ఈ రోజు డ్యామ్ 19వ గేటు కొట్టుకొని పోవడానికి ప్రధాన కారకులు డ్యామ్ నీటిపారుదల అధికారులే అన్నారు. ఎందుకంటే డ్యామ్ మేంటనెన్స్‌పై అశ్రద్ధ వహించిన కనీసం గేట్లకు గ్రీసుకూడా వేయనందున ఈ స్థితికి తీసుకొచ్చారని తెలిపారు. గేటు కొట్టుకుపోయి నందువల్ల సుమారు 60 టిఎంసిలు వృథా అవుతుందనీ, దీనిని తిరిగి పునర్మాణం కోసం కనీసం నెలరోజులు పట్టవచ్చని నీటిపారుదల అధికారులు వెల్లడిస్తున్నారన్నారు. ప్రస్తుతం నీటిపారుదల అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడి అప్రమత్తం చేశారని తెలిపారు. తెలంగాణ, ఎపి ఇంజనీర్లు కర్ణాటక వారితో సమన్వయంతో వీలైనంత తొందరలో మరమ్మతుకు పూనుకోవాలని కోరారు. లోతట్టు ప్రాంతాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తిచేశారు. నీరు వృధా అయినప్పటకీ 40 టిఎంసిల మేరకు నీరు ఉంటుందని, కనుక ఒక కారు పంటలకు ఇబ్బంది ఉండొచ్చని వివరించారు. మూడు రాష్ట్రాల నీటిపారుదల అధికారులు ఈ విషయంలో చొరవతీసుకొని వెంటనే మరమ్మతులకు పూనుకోవాలనీ విజ్ఞప్తిచేశారు.

హాస్టల్ విద్యార్థులకు అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



ప్రభుత్వ బాలికల వసతి గృహం ఎస్‌సి నెంబర్‌వన్‌లో డిగ్రీ థర్డ్ , సెకండ్ , ఫస్ట్ ఇయర్‌లో ఆయా కాలేజీలలో టాపర్స్‌గా నిలిచిన విద్యార్థినులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఫర్‌మెన్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ ఇందిరా శాంతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో మహిళలకు విద్య ఎంతో అవసరమని, అందరూ చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎస్‌సి నెంబర్ వన్ కాలేజ్ హాస్టల్‌లో ఇంతమంది విద్యార్థులు కాలేజ్ టాపర్స్‌గా నిలవడం అభినందించదగ్గ విషయమన్నారు. డిగ్రీ 1,2,3 సంవత్సరాలలో వందశాతం సాధించడం చాలా సంతోషమన్నారు. దీనికి కారకులైన హెచ్‌డబ్ల్యు బెన్నెమ్మను, విద్యార్థినులను అభినందించారు. టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు శాలువా, బొకే , పూలదండతో సన్మానించారు.ప్రిన్సిపల్ ఇందిరా శాంతిని వసతి గృహ సిబ్బంది శాలువా బొకేతో సన్మానించారు. ఎస్‌సి కాలేజ్ హాస్టల్ హెచ్‌డబ్ల్యుఒలు బెన్నెమ్మ, రజని, విద్యార్థినులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎక్కడి సమస్య అక్కడే ...!

-మరమ్మతుకు నోచని రోడ్లు-ఎక్కడి చెత్త అక్కడే
-ఆఫీసులకే పరిమితమైన అధికారులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రతిబడ్జెట్‌లో రోడ్లమరమ్మతుల కోసం, పారిశుధ్యాన్ని మెరుగుపరిచేందుకు రూ.కోట్ల కేటాయించడం వాటిని ఖర్చు పెట్టినట్లు లెక్కలు చూపిస్తున్నారన్నారు. నగరంలో పలు కాలనీలో రోడ్లపై ఎక్కడి గుంతలు అక్కడే...ఎక్కడిచెత్త అక్కడే...అనే చందంగా తయారైందన్నారు. పలు కాలనీల అసోసియేషన్ల ప్రతినిధులు కె.ప్రమోద్ కుమార్ రెడ్డి, జె.నరేంద్ర, టి.కృష్ణ, ఎస్.సురేంద్ర, పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేనిపుల్లారెడ్డి విమర్శించారు. ఆదివారం రామలింగేశ్వర నగర్, మున్సిపల్ కాలనీ, ఎస్‌బిఐ కాలనీ, సీతారామ నగర్ మీదుగా కొత్త బస్టాండ్ వరకు స్థానికులతో కలిసి పట్టణ పౌర సంక్షేమ సంఘం ప్రతినిధి బృందం పర్యటించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశ్చిమ ప్రాంత కాలనీల ప్రజలు చౌరస్తా మీదుగా లేదా ఇందిరాగాంధీ నగర్ మీదుగా వచ్చే ప్రజలు ట్రాఫిక్ సమస్యలతో ఇబ్బంది పడకూడదని స్పెషల్ పోలీసు క్యాంపు పక్కన, రామలింగేశ్వర నగర్ సీతారామ నగర్ మీదుగా కొత్త బస్టాండ్ వెళ్లేందుకు రోడ్డును ఏర్పాటు చేశారని, సదరు రోడ్డులో ప్రయాణించేందుకే ప్రజలు భయపడే పరిస్థితి ఏర్పడిందన్నారు. పైపులైన్ల మరమ్మతుల కోసం తువ్వేసిన పెద్దపెద్ద గుంతలు, ఎగుడు దిగుడు రోడ్లు, రోడ్లపై నిలిచిన వర్షంనీరు, దీనికితోడు రోడ్లపై చెత్త పేరుకొని పోయి భరించలేని దుర్వాసన వస్తున్నదన్నారు. రాత్రి సమయాల్లో అనేకమంది ద్విచక్ర వాహనదారులు, తెల్లవారుజామున వాకర్సు ,వృద్ధులు కింద పడుతున్నారన్నారు. కింది స్థాయి అధికారులు వీధుల్లో తిరగకుండా ప్రజా సమస్యలు పట్టించుకోకుండా ఆఫీసులకే పరిమితమయ్యారన్నారు. నగర మేయర్, వార్డు కార్పొరేటర్లు వెంటనే స్పందించాలన్నారు. ఉన్నతాధికారులు కూడా జోక్యం చేసుకొని ప్రజల సమస్యలు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్య తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో ఎండి. యూనుస్, కె ప్రవీణ్ కుమార్ రెడ్డి, బి.రాజు, జి అశోక్, ఎస్.అన్వర్‌బాష, పురుషోత్తం రెడ్డి పాల్గొన్నారు.



మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం పునఃప్రారంభం

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

ప్రముఖ అంతర్జాతీయ ఆభరణాల వ్యాపార సంస్థ అయిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, కర్నూలు షోరూంను ఆదివారం పునఃప్రారంభించింది. ఈ వేడుకనుపాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డిరిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. గౌరవ అతిథులు, వినియోగదారులు, శ్రేయోభిలాషులు , మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ మేనేజ్‌మెంట్ బృంద సభ్యులు పాల్గొన్నారు. కర్నూలు షోరూం పునఃప్రారంభం సందర్భంగా మలబార్ గ్రూప్ చైర్మన్, ఎంపి. అహమ్మద్, ఎపి, తెలంగాణ క్లస్టర్ హెడ్స్ నిఖిల్ చంద్రన్, కె.షానిబ్ మార్కెటింగ్ హెడ్ రాకేష్ ఈ వేడుక గురించి మాట్లాడుతూ 'కర్నూలు షోరూంను పునఃప్రారంభించడం చాలా ఆనందంగా ఉందన్నారు. కస్టమర్ల సంతృప్తి అనేది మా విజయానికి మూలస్తంభంగా భావిస్తామన్నారు. కస్టమర్ల అభిరుచులకు అత్యధిక ప్రాధాన్యతను ఇచ్చి, వారి సంతృప్తి కోసం అపారమైన కషి చేస్తున్నామన్నారు. కర్నూలు షోరూం ద్వారా అంతర్జాతీయ స్థాయి షాపింగ్ వాతావరణం కల్పించడం, వినియోగదారులకు విస్తృతమైన ఆభరణాల సేకరణలు అందించడం, తదితర విషయాల్లో మేము అంకితభావంతో పని చేస్తామని తెలిపారు. ఈ షోరూంలో విలాసవంతమైన వాతావరణంతో, అద్భుతమైన ఆభరణాల సేకరణలు అందుబాటు ధరల్లో లభిస్తాయి. ప్రారంభోత్సవ ఆఫర్లో భాగంగా, బంగారు ఆభరణాల , వజ్రాభరణాల కొనుగోలుపై వెండి నాణేలను ఉచితంగా అందిస్తున్నాం. ఈ ఆఫర్ ఈనెల 11 నుండి 25 వరకు అందుబాటులో ఉంటుందని నిర్వహకులు తెలిపారు. (నియమ నిబంధనలు వర్తిస్తాయి). బంగారం, వజ్రాలు, పోల్కీ, విలువైన రత్నాలు, వెండి, ప్లాటినం ఆభరణాల యొక్క విస్తృత శ్రేణి సేకరణలు, విభిన్న అభిరుచులు కలిగిన వారికి, వివిధ సందర్భాలు , వేడుకలకు సరిపోతూ, మీ బడ్జెట్ లోనే లభిస్తాయని వినియోగదారులకు సూచించారు.

మైన్ డైమండ్ జువెలరీ, ఎరా అన్కట్ డైమండ్ జువెలరీ, డివైన్ హెరిటేజ్ జువెలరీ, ఎథ్నిక్స్ హ్యాండ్ క్రాఫ్టెడ్ జ్యువెలరీ, ప్రెసియా జెమ్ స్టోన్ జువెలరీ, విరాజ్ పోల్కీ జ్యువెలరీ వంటి మలబార్ ప్రత్యేక బ్రాండ్లు ఈ షోరూంలో లభిస్తాయన్నారు. రోజువారీ ధరించడానికి సాంప్రదాయ, సమకాలీన ఆభరణాల నుండి తేలికైన ఆభరణాల వరకు, ఏ సందర్భానికైనా సరిపోయే ఆభరణాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో స్టోర్ హెడ్ కె. ఫయాజ్, మయిజ్, అజీష్, మార్కెటింగ్ మేనేజర్ నూరుల్లా, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



మలబార్ అండ్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూంను ప్రారంభిస్తున్న గౌరు చరిత




ప్రజలకు అందుబాటులో హోల్‌సేల్ దుకాణం

ప్రారంభించిన ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్

కల్లూరు అర్బన్ 32 వ వార్డ్ ముజఫర్ నగర్ రైతు బజార్ ఎదురుగా నూతన ఎస్ఎస్ఆర్‌కె ట్రేడర్స్ హోల్ సెల్ , రిటైల్ షాప్‌ను పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత ఉద్యోగాల కోసమే కాకుండా వ్యాపారంలో సైతం రాణించాలన్నారు. ముజఫర్‌నగర్ వాసులు ఎస్ఎస్ఆర్‌కె ట్రేడర్స్‌ను ఆదరించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఎస్ఎస్ఆర్‌కె యజమాని షేక్ షారుక్ మాట్లాడుతూ తమ షాపులో హోల్ సేల్ ధరలకే ఉల్లి పాయలు, ఎల్లిపాయలు, కొబ్బర, కొబ్బరి బొండాలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ పెరుగు పురుషోత్తం రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, వార్డ్ నాయకులు మాజీ కార్పొరేటర్ సోమన్న, టైలర్ నాగరాజు, రవి ప్రకాష్ రెడ్డి, గిరి, మౌలాలి కుటుంబ సభ్యులు మిత్రులు తదితరులు పాల్గొన్నారు.



వీకర్ సెక్షన్ కాలనీలలో కార్డెన్ సెర్చ్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు జిల్లా ఎస్‌పి జి. బిందుమాధవ్ ఆదేశాల మేరకు కర్నూలు డిఎస్‌పి జె. బాబు ప్రసాద్ ఆధ్వర్యంలో కర్నూలు రెండవ పట్టణ సిఐ నాగరాజా రావు, కర్నూలు నాల్గవ పట్టణ ఎస్ఐలు మోహన్ కిశోర్, చంద్రశేఖర్ రెడ్డి , కర్నూలు పోర్త్ టౌన్, టు టౌన్ పోలీసులు , సెబ్ పోలీసులు కలిసి కర్నూలు నాల్గవ పట్టణ పోలీసుస్టేషన్ పరిధిలోని ఎన్‌టిఆర్ కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీలలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా కర్నూలు వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన రౌడీషీటర్ షేక్ చంద్ బాషా ఏదుడు అదుపులోకి తీసుకుని విచారించారు. అతని నుండి ఒక డ్రాగన్ షార్ప్ ఎడ్జ్ నైఫ్ , 3 బీరుబాటిల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్రైమ్ రికార్డులలో అతనిపై ఇది వరకే కర్నూలు నాల్గవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో 3 కేసులు నమోదయ్యాయి. రౌడీషీటర్ల కదలికల పై ప్రత్యేక నిఘా ఉంచామని పోలీసు అధికారులు తెలిపారు.

మంత్రి లోకేష్ ను కలిసిన సూరం భాస్కర్ రెడ్డి

ప్రజాశక్తి- ఆదోని



టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి మంత్రి నారాలోకేష్‌ను మర్యాదపూర్వకంగా హైదరాబాదులో కలిశామని ఆదోని టిడిపి సీనియర్ నాయకుడు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సూరం భాస్కర్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఆదోని నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితులపై ఆరా తీశారన్నారు. పార్టీ గెలుపు కోసం కృషి చేసిన వారందరికీ త్వరలోనే తగిన గుర్తింపు ఇస్తామని లోకేష్ హామీ ఇచ్చారన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయం మేరకే తాము కట్టుబడి ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కార దిశగా చొరవ చూపుతామని సూరం భాస్కర్ రెడ్డి తెలిపారు.

ఆదోని డీఎస్పీగా సోమన్న బాధ్యతలు

ప్రజాశక్తి - ఆదోని



ఆదోని డీఎస్పీగా డి సోమన్న ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఆదోని తాలూకా పోలీస్ స్టేషన్ సీఐగా పని చేశామన్నారు. గుంటూరు సీఐడి శాఖలో సీఐగా పనిచేస్తూ పదోన్నతి పొంది బదిలీపై ఆదోనికి వచ్చారు. డీఎస్పీ మాట్లాడుతూ ఆదోని సబ్ డివిజన్‌లో మట్కా, క్రికెట్ బెట్టింగ్, పేకాట, గంజాయి తదితర అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

కేంద్ర మంత్రికి శ్రీ మఠం ఆహ్వానం

ప్రజాశక్తి - మంత్రాలయం



మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో జరుగనున్న ఆరాధన మహోత్సవాలకు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి శ్రీ మఠం ఆహ్వానం అందిచింది. ఆదివారం తెలంగాణ రాష్ట్రంలోని కేంద్ర మంత్రి చాంబర్‌లో శ్రీ మఠం సూపరింటెండెంట్ పురాణిక రాఘవేంద్ర చార్ కలుసుకొని ఆహ్వాన పత్రిక అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 18 నుంచి 24 వరకు జరిగే శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలకు కుటుంబ సమేతంగా విచ్చేయాలని కోరారు.

లోకేష్‌ను కలిసిన ఉమ్మి సలీం

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్‌ను హైదరాబాదులోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి ఉమ్మి సలీం ఆదివారం విలేకరులకు తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు, ఆదోనిలో అభివృద్ధి పనులు, పథకాల అమలు తదితర విషయాలపై చర్చించినట్లు తెలిపారు. పథకాల అమలు ప్రక్రియపై విధివిధానాలు రూపుదిద్దుకుంటున్నట్లు మంత్రి వెల్లడించినట్లు తెలిపారు.

ప్రమాదకరంగా బ్రిడ్జి

- తేలిన ఇనుప చువ్వలు

ప్రజాశక్తి-ఆదోని రూరల్

ఆదోని పట్టణంలో నల్లగేట్ రైల్వే గేట్ ఉండగా ట్రాఫిక్‌కు అంతరాయంగా ఉండడంతో వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని 2015వ సంవత్సరం నూతన బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. ఆ బ్రిడ్జి ప్రారంభించి 9 సంవత్సరాలు అయింది. అయితే నూతన బ్రిడ్జ్ నిర్మించిన వంతెనపై సిమెంట్ బెడ్డు తొలగిపోయి, ఇనుపచువ్వలు పైకితేలాయి. దీంతో వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇనుప చువ్వలు ప్రమాదకరంగా ఉన్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా సిరుగుప్ప, సిందనూర్, రాయచూర్, మంత్రాలయం, మాధవరం నుంచి పెద్దపెద్ద వాహనాలు ఈ బ్రిడ్జి పైనే ప్రయాణం చేస్తూ పట్టణంలో చేరుకుంటారు. అయితే బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్ నిర్మాణం పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశాడు. వంతెనపై చిన్న పాటి వర్షం పడితే చాలు వర్షపు నీరు వంతెనపై నుంచి పారుతోంది. వాహనాల రాకపోకలు అధికం కావడంతో బ్రిడ్జిపైన సిమెంట్ తొలగిపోయి ఇనుప చువ్వలు పైకి తేలాయి. ఏమాత్రం అక్కడ ఏమరుపాటును ప్రదర్శించినా తేలిన ఇనుపచువ్వలు టైర్లకు తగిలి టైర్లు పగిలిపోయే ప్రమాదముంది. ప్రాణాపాయం జరగకముందే అధికారులు స్పందించి బ్రిడ్జిపై మరమ్మతులు చేసి దానిపైన సిమెంట్ బెడ్డువేయాలని ప్రజలు కోరుతున్నారు.



బ్రిడ్జిపైన తేలిన ఇనుప చువ్వలు

బస్సు సౌకర్యం కల్పిస్తాం

- గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం

ప్రజాశక్తి - చిప్పగిరి



గుంతకల్లు బస్సు స్టేజి నుంచి చిప్పగిరి మీదుగా బంటనహాల్ గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తానని ఆ గ్రామ ప్రజలకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం హామీ ఇచ్చారు. ఆదివారం బంటనహాల్ సర్పంచ్ సుశీలమ్మ, టిడిపి నాయకులు సురేష్ ఆధ్వర్యంలో గ్రామ ప్రజలు బస్సు సౌకర్యం కల్పించాలని గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఏ సమస్య వచ్చినా పరిష్కరించడానికి సిద్ధంగా ఉందన్నారు. గ్రామం నుంచి ప్రతిరోజు చదువుకోడానికి విద్యార్థులు, తదితర పనులపై వెళ్లే ప్రజలు రవాణా సౌకర్యం లేక అవస్థలు పడుతున్నారనేది వాస్తవమన్నారు. తప్పనిసరిగా గుంతకల్ డిపో మేనేజర్ నాగరాజు గౌడుతో మాట్లాడి వెంటనే బస్సు సౌకర్యం కల్పిస్తానని వారికి భరోసా ఇచ్చారు. గుత్తి టిడిపి ఇన్చార్జి గుమ్మనూరు నారాయణ, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



నది తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి- కౌతాళం

తుంగభద్ర నది తీరంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ శివనారాయణశర్మ పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని మేలిగనూర్, నదిచాగి, కుంభలనూర్, మరళి, గుడికంబాలి, వల్లూరు గ్రామాలలో పర్యటించి వరద నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నదీ పరివాహక ప్రాంతంలో ప్రజలు వెళ్లకూడదని పేర్కొన్నారు. పశువుల కాపరులు, చేపలవేట, కర్ణాటకకు వెళ్లడానికి ప్రజలు ప్రయత్నించరాదన్నారు. రెవిన్యూ అధికారులు నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రజలకు అప్రమత్తం చేయాలని సూచించారు. తుంగభద్ర జలాశయం నుండి నీటి ప్రవాహం ఏ క్షణానైనా పెరగవచ్చని, ఇది ప్రతి ఒక్కరు గమనించాలన్నారు. ఆయన వెంట తమశీల్దార్ మల్లికార్జున స్వామి, ఆర్ఐ రాజశేఖర్, విఆర్ఒలు తదితరులు పాల్గొన్నారు.



రోడ్లపై గుంతలను పూడ్చిన విద్యార్థి సంఘాల నాయకులు

ప్రజాశక్తి-ఆస్పరి : మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో రోడ్లపై ఉన్న గుంతలను ఎఐటియుసి మండల సహాయ కార్యదర్శి వీరేష్, ఏఐవైఎఫ్ మండల కార్యదర్శి రమేష్ ఆధ్వర్యంలో ఆదివారం పూడ్చివేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్ అండ్ బి అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. నిత్యం మంత్రాలయం, ఎమ్మిగనూరు, పత్తికొండ పట్టణాలకు వాహనాలు ఈ రోడ్డుపైనే వెళుతుంటాయని, చిన్నపాటి వర్షం పడిందంటే చాలు గుంతల్లో నీళ్లు చేరి డ్రైనేజీని తలపిస్తుందన్నారు. ద్విచక్ర వాహనదారులు గుంతల్లో పడి గాయాలు పాలైన దాఖలాలు లేకపోలేదన్నారు. చివరకు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గుంతలు పడ్డ రోడ్లకు మట్టి వేసి పూడ్చివేశామన్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బి అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటియుసి గ్రామ కార్యదర్శి శ్రీను, రంగన్న, బద్రి, జానకి రాముడు, సురేష్‌లు పాల్గొన్నారు.

మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు అభినందనీయం



- ఎస్ఐ గోపినాథ్, హైకోర్టు న్యాయవాది చంద్రశేఖర్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించేందుకు బిగ్ టీవీ యాజమాన్యం, అమీలియో హాస్పిటల్ వారు సంయుక్తంగా నిర్వహించిన మెగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్ఐ గోపినాథ్, హైకోర్టు న్యాయవాది కాకర్ల చంద్రశేఖర్ ప్రశంసించారు. ఆదివారం మండల పరిధిలోని చిలుకలడోణ గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. బిగ్ టివి యాజమాన్యం తరపున ప్రజలకు సేవా కార్యక్రమాలు చేయడం ఆదర్శం అన్నారు. ప్రతి వ్యక్తికి ఆరోగ్య విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సేవలను విస్తృతం చేయాలని కోరారు. సుమారు 145 మంది ఈ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకున్నారు. కార్యక్రమంలో ఎపి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు నేపాల్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఆస్పరి : మండల కేంద్రమైన ఆస్పరిలోని ఎస్సీ బాలుర హాస్టల్లోని సమస్యలపై గత నెల 29న సంక్షేమ హాస్టల్లో సమస్యల ఏకరువు అన్న ప్రజాశక్తి కథనానికి ఇంఛార్జి వార్డెన్ నాగరాజు స్పందించారు. ఆయన సొంత డబ్బులతో మరుగుదొడ్లకు మరమ్మతులు చేయించారు. ఆదివారం 8 మరుగుదొడ్లను వార్డెన్ సొంత ఖర్చుతో మరమ్మతులు చేయించానని ఇంఛార్జి వార్డెన్ నాగరాజు తెలిపారు. ప్రభుత్వం ఐదేళ్లలో ఎస్సీ బాలుర హాస్టల్‌కు ఎటువంటి నిధులు మంజూరు చేయకపోవడం వల్లే హాస్టల్లోని బాత్రూము, మరుగుదొడ్ల రిపేరు చేయించడానికి నిధులు లేక అలానే వదిలేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి క్లీన్ స్లీపర్, వాచ్మెన్‌ను నియమించి, నిధులు కేటాయిస్తే సంక్షేమ హాస్టల్ సమస్యలు పరిష్కరించుకోవచ్చన్నారు.



వర్షం కోసం సప్త భజనలు

- అన్నదానానికి రూ.10 వేలు విరాళం

ప్రజాశక్తి - కౌతాళం : మండల పరిధిలోని తోవిగ్రామంలో వర్షం కోసం కాశి విశ్వనాథ స్వామి దేవాలయంలో సప్త భజనలు చేస్తున్నారు. దేవాలయంలో సప్త భజనలు ముగింపు రోజు అన్నదాన కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ గిత్తర్ నరసప్ప రూపాయలు విరాళంగా ఇస్తున్నట్లు ఆదివారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల మంచి కోసం చేసే ఏ కార్యక్రమంకైనా తన వంతు సహకారాన్ని అందిస్తామన్నారు.

తుంగభద్ర తీర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం



కర్ణాటక రాష్ట్రంలోని తుంగభద్ర నది డ్యాం గేటు కొట్టుకొని పోయి భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో తుంగభద్ర నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి సూచించారు. ఆదివారం ఆయన ఫోన్ ద్వారా మీడియాకు సమాచారం తెలిపారు. కర్నూలు జిల్లాలోని కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి. బెళగల్ మండలాల్లోని తీర ప్రాంత ప్రజలు కాస్త జాగ్రత్తగా ఉండాలని పంట పోల్లాలో పైర్ల సాగునీటిని అందించేందుకు ఏర్పాటు చేసుకున్న మోటార్లును ఒడ్డున ఏర్పాటు చేసుకోవాలని అన్నదాతలను కోరారు. అధికారులు కూడా ప్రజలకు హెచ్చరికలు జారీ చేయాలని చెప్పారు. ఎలాంటి నష్టం జరుగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

దేవాలయాల ఆస్తులపై శ్వేతపత్రం విడుదల చేయాలి

ప్రజాశక్తి-ఆదోని

రాష్ట్ర విభజన జరిగిన నాటి నుంచి దేవాలయాలు, వాటి ఆస్తులపై శ్వేత పత్రం విడుదల చేయాలని విశ్వ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు నంది రెడ్డి సాయి రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆదోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడారు. ఆగస్టు మూడు, నాలుగు తేదీలలో తిరుపతి జిల్లాల్లో వరదయ్యపాలెంలో రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో వివిధ సమస్యలపై తీర్మానం చేస్తారన్నారు. తీర్మానాల అమలు అయ్యేంతవరకు రాష్ట్రవ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు. ఈ సమావేశంలో విశేష సంపర్క రాష్ట్ర ప్రముఖ్ టి.ప్రతాపరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తలారి ఆంజనేయులు, భీమ్ రెడ్డి, రాధమ్మ, ధర్మ గుణ, జిల్లా కార్యదర్శి హనుమంత్ రెడ్డి, సహ కార్యదర్శి శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి : సిపిఐ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని సిపిఐ మండల కార్యదర్శి విరూపాక్షి డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ పట్టణ కార్యదర్శి కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆస్పరి పట్టణంలో తాగునీటి సమస్య విపరీతంగా ఉందని, 10 నుండి 15 రోజులకు ఒకసారి నీళ్లు వదలడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. సంబంధిత అధికారులు స్పందించి నాగనాథన హళ్లి నుంచే వచ్చే నీరు ఆస్పరికి సక్రమంగా సరఫరా అయ్యేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఉరుకుందప్ప, బ్రహ్మాయ్యరైతు సంఘం మండల కార్యదర్శి రంగన్న, నాయకులు సంజయ్ హనుమంతు, చంద్ర, గోపాల్, మానంది, ఈశ్వర్ పాల్గొన్నారు.

స్నేహితునికి కుటుంబానికి చేయూత

ప్రజాశక్తి - వెల్దుర్తి



వెల్దుర్తి పట్టణంలో నివాసం ఉంటున్న వడ్డే చల్లా ప్రసాద్ గత వారం అనా రోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసు కున్న వెల్దుర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1994-1995 సంవత్సరం పదవ తరగతి చదువుకున్న ఆయన మిత్రులు మరణించిన తమ స్నేహితుని కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అలాగే మిత్రుని కుటుంబానికి తమ వంతుగా రూ.41వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజన్న ఆచారి, అల్లా బాకాష్, మహేష్, ఫనిరాజ్, భాస్కర్, అనిల్ పాల్గొన్నారు.

గుండె జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

-కార్డియాలజిస్ట్ డాక్టర్‌రామ పకీరా

-ఎస్ఎస్ఎం దంత వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండల కేంద్రమైన గోనెగండ్లలోని వికాస్ విద్యా విహార్ పాఠశాలలో ఎస్ఎస్ఎం దంత వైద్యశాల ఆధ్వర్యంలో కర్నూలు శ్రీచక్ర హాస్పిటల్ వారిచే ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీచక్ర హాస్పిటల్ కర్నూలు ఆసుపత్రి కార్డియాలజిస్ట్ డాక్టర్ రామఫకీర వికాస్ పాఠశాల డైరెక్టర్ రహిమాన్ పటేల్, ఎమ్మిగనూరు మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎస్‌బి మన్సూర్ ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. డాక్టర్ రామ ఫకీరా మాట్లాడుతూ గుండె సమస్యలను ప్రతి ఒక్కరూ ప్రాథమిక దశలోనే గుర్తించి ఇసిజి టూడిఎకో లాంటి పరీక్షలను చేయించుకొని గుండెపోటు రాకుండా జాగ్రత్త పడాలని అన్నారు. శ్రీ చక్ర హాస్పిటల్‌లో ఎన్‌టిఆర్ వైద్య సేవలతో గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని అన్నారు. కార్యక్రమానికి హాజరైన ప్రజలకు కంటి , దంత పరీక్షలు, ఇసిజి.2డి ఎకో లాంటి గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. దంత వైద్యులు డాక్టర్ షేక్‌మియా, డాక్టర్ గౌతమ్ ఆర్ఎంపిల సంఘం రాష్ట్ర నాయకులు ఉస్మాన్, నాగేశ్వర రెడ్డి, శివ, వెంకట రమణ పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న కార్డియాలజిస్ట్ డాక్టర్‌రామ పకీరా

విద్యుత్ శాఖలో ఖాళీ పోస్టులను భర్తీ చేయండి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్

విద్యుత్ శాఖలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని డివైఎఫ్ఐ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ధ్యక్షులు రాఘవేంద్ర జిల్లా కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. ఆ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్ సంస్థల్లో ఇంజనీర్ల కొరత వేధిస్తుందని ఏటా ఉద్యోగ విరమణ చేస్తున్న పోస్టుల్లో కొత్త నియామకాలు చేసేందుకు ప్రభుత్వం విద్యుత్ సంస్థల ముందుకు రావడంలేదని అన్నారు. నియామకాలు లేనందువల్ల ఉన్న ఇంజనీర్లపైనే పని భారం పెరుగుతోందని అన్నారు. ఒక పక్క ఉద్యోగాలు లేక నిరుద్యోగం పెరిగిపోతూ ఉంటే ఉన్న పోస్టులను భర్తీ చేయకుండా పనిభారం పెంచడంసరైనది కాదని విమర్శించారు. ఆరేళ్లుగా ఒక్క ఇంజనీరింగ్ పోస్ట్‌కు కూడా నోటిఫికేషన్ విడుదల కాలేదని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యుత్ సంస్థల్లో నియామకం అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎఇ స్థాయి వరకు ఉంటుందని అన్నారు. మొత్తం మూడు విద్యుత్ సంస్థల్లో మంజూరు పోస్టులు 7500 ఉంటే 5000 మంది మాత్రమే పనిచేస్తున్నారని 2500 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఇటీవల విద్యుత్ సంస్థల్లో సుమారు 500 మంది ఉద్యోగులు స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారని అన్నారు. తమపై పని ఒత్తిడి తీవ్రంగా ఉందని పోస్టులు భర్తీ చేయాలని ఉద్యోగులు ప్రభుత్వానికి విద్యుత్ సంస్థ యజమానులకు పలుసార్లు విన్నవించారంటే పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థుల లక్షలాదిమంది ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్నారని, వెంటనే వాటిని భర్తీ చేసి వారికి ఉపాధి చూపించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఇంజనీరింగ్ విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు వీరేష్, సురేష్ జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

ఎపి వ్యవసాయ ఉద్యోగుల సర్వీసు సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్



నూతన కార్యవర్గం

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ ఉద్యోగుల సర్వీసు సంఘం కర్నూలు జిల్లా యూ నిట్ కు ఆదివారం నూతన కార్యవర్గాన్ని ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. కర్నూ లు జిల్లా అధ్యక్షులు కె.రవి ప్రకాష్ రావు, జిల్లా కార్యదర్శి ఎంసి.కాశన్న, జిల్లా కోశాధికారి బి.నాగకిశోర్, జిల్లా సహాధ్యక్షులు పి.రమేష్ బాబు, జిల్లా ఉపాధ్యక్షులుగా పి.మునీర్ అహమ్మద్, ఎస్. యశానుల్లా, రాఘవేంద్ర కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా బిసి.శంకర్ నాయక్, కార్యనిర్వాహక కార్యదర్శి (మహిళ) ఎ. సుభాషిణి, సహా కార్యదర్శులు వి.నారాయణ, ఎస్. ఎలియాజ్ బాషా, ఎం.సాయికుమార్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్‌గా బి.దేవరాజు, రాష్ట్ర కౌన్సెలర్‌గా ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారిగా ఎం. వెంకటేశ్వరరావు , సహాయ ఎన్నికల అధికారి రమేష్ , ఎలక్షన్ పరిశీలకులుగా డిఎస్ఎన్. శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షులు సాయికుమార్ , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవి కుమార్ పాల్గొన్నారు కర్నూలు , నంద్యాల జిల్లా వ్యవసాయ శాఖ ఉద్యోగులందరు పాల్గొన్నారు.

పల్లేటి మరణం పద్య నాటకానికి తీరని లోటు

ప్రజాశక్తి -కర్నూలు కల్చరల్

పల్లేటి కులశేఖర్ మరణం నాటక రంగానికి తీరని లోటు అని రవీంద్ర విద్యా సంస్థల అధినేత జి.పుల్లయ్య అన్నారు. ఆదివారం రాత్రి నెల్లూరు లక్ష్మీనరసింహ నాట్య కళా మండలి సభ్యులు జానకిరామ్ దర్శకత్వంలో భక్త అన్నమయ్య పద్య నాటకాన్ని ప్రదర్శించారు. అంతకుముందు సంస్మరణ సభ జరిగింది. పల్లేటి కులశేఖర్ చిత్రపటానికి పూలమాల సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేసి కళాకారులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం నాటక దర్శకులు జానకి రాముడు ,టిజివి కళాక్షేత్రం రూ.60 వేల పారి తోషికం ఇచ్చి సత్కరించింది. ఈ కార్యక్రమంలో కళాకారులు వివి.రమణారెడ్డి,హెచ్.చంద్రన్న ఎండి క్రిష్టఫర్, జివి శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మన్న, మహమ్మద్‌మియా, ఇనాయతుల్లా తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం వాగ్గేయకారులు అన్నమయ్య పద్యనాటకం ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది.

పల్లేటికి నివాళి అర్పిస్తున్న అతిథులు



మంత్రి లోకేష్‌ను కలిసిన కప్పట్రాళ్ల బొజ్జమ్మ దంపతులు

ప్రజాశక్తి - దేవనకొండ



రాష్ట్ర టెక్నా లజీ, ఇన్ఫర్మేషన్, పరిశ్రమల శాఖ మంత్రి నారా లోకేష్ బాబును మండల మాజీ ఎంపీపీ రామచంద్ర నాయుడు, ఆయన భార్య ఆస్పరి మాజీ జెడ్పిటిసి బొజ్జమ్మలు ఆదివారం విజయవాడలోని అమరావతిలో కలిశారు. ఈ సందర్భంగా ఆలూరు నియోజకవర్గం పరిస్థితులను వివరించారు. నియోజకవర్గంలోని గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు.



మొక్కను నాటుతున్న శివారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత బి.నకేష్ రెడ్డి

బదినేహాల్‌ను హరితవనంగా తీర్చిదిద్దుతాం

- శివారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత బి.నకేష్ రెడ్డి

ప్రజాశక్తి - కౌతాళం

మండల పరిధిలోని బదినేహాల్ గ్రామాన్ని హరితవనంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని శివారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ అధినేత నకేష్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం గ్రామంలో ప్రజలను చైతన్యం చేస్తూ వివిధ రకాల మొక్కలను నాటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు జన్మనిచ్చిన గ్రామంపై మమకారంతో వృక్షో రక్షతి రక్షితః అనే నానుడిని నిజం చేస్తూ రాజమండ్రి జిల్లా కడియం నర్సరీ నుండి సుమారు లక్ష 50 వేల రూపాయలు తన సొంత డబ్బులు వెచ్చించి అనేక రకాల అందమైన మొక్కలను తెప్పించి గ్రామ ప్రజలతో నాటించినట్లు తెలిపారు. గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రజల డబ్బులు దండుకుని బాగుపడాలని చూసే ఈ రోజుల్లో సొంత డబ్బు ఖర్చు పెట్టి గ్రామం అభివృద్ధి చేయాలనే నాయకుడు నకేష్ రెడ్డి దొరకడం తమ అదృష్టమన్నారు. చెట్ల వల్ల గ్రామ ప్రజలకు మంచి ఆక్సిజన్ దొరికి ఆరోగ్యవంతంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాల నరసప్ప, హుగార్ అమరేష్, శివకుమార్ స్వామి, మౌలాసాహేబ్, శివారెడ్డి యూత్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



మాలల మనోభావాలు దెబ్బతీసేలా తీర్పు

ప్రజాశక్తి - ఆదోని : ఎస్సీ వర్గీకరణపై ధర్మాసనం ఇచ్చిన తీర్పు మాలలు మనోభావాలు దెబ్బతిసే విధంగా ఉందని రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జై భీమ్ సాయిరామ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నరసప్ప, కర్నూలు జిల్లా అధ్యక్షులు మహానంది, డివిజన్ అధ్యక్షులు ఎల్లప్ప అన్నారు. ఆదివారం ఆదోనిలోని జేబి గార్డెన్‌లో కల్లుపోతుల రంగన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. సుప్రీంకోర్టు మనువాదుల చేతిలో కీలుబొమ్మలా మారిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పునకు వ్యతిరేకంగా భవిష్యత్ కార్యాచరణతో ముందుకు పోయే విధంగా 30 మంది సభ్యులచే నూతన కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కమిటీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టే ర్యాలీలో పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కోళ్ల ఆంజనేయులు, కల్లుపోతుల సురేష్, ఎమ్మిగనూరు రంగయ్య, వైపి వీరేష్, కళ్ళుపోతుల రవి, బన్నూరు అంజి తదితరులు పాల్గొన్నారు.